క్లుప్తంగా

స్కూల్ బ్యాగులు పంపిణీ



విద్యార్థులతో రఘునాథ్

నస్పూర్: పట్టణ పరిధిలోని తీగల్‌పహడ్ జెడ్పీహెచ్ఎస్‌లో రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వెరబెల్లి రఘునాథ్ విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నస్పూర్ పట్టణ అధ్యక్షుడు సత్రం రమేశ్, నాయకులు కట్కూరి సతీష్‌కుమార్, మిట్టపల్లి మొగిళి, కుర్రె చక్రి, కాదాసు భీమయ్య, మాలోత్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కత్తెరశాలలో డీపీవో పర్యటన



కంపోస్టు షెడ్ పరిశీలిస్తున్న డీపీవో

చెన్నూర్‌రూరల్: మండలంలోని కత్తెరసాల గ్రామ పంచాయతీని మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు తనిఖీ చేశారు. వర్షాకాలం దృష్ట్యా శానిటేషన్ పనులు చేపట్టాలని సూచించారు. కంపోస్టు షెడ్‌ను పరిశీలించి చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించి తడి, పొడి చెత్తను వేరు చేయాలని పేర్కొన్నారు. అనంతరం అంగ్రాజ్‌పల్లి గ్రామంలోని పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఆరోగ్య శాఖ సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అంటువ్యాధులపై ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ఎంపీడీవో మోహన్, ఎంపీవో అజ్మత్‌అలీ, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ ఉన్నారు.

విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించాలి



మొక్క నాటుతున్న డీఈవో యాదయ్య

తాండూర్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపర్చాలని, ఆ దిశగా ఉపాధ్యాయులు బోధన సాగించాలని జిల్లా విద్యాధికారి యాదయ్య సూచించారు. మండలంలోని తంగళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డులు పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి మల్లేశం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల కోసమే నాణ్యమైన విద్యుత్



ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభిస్తున్న ఎస్ఈ

లక్సెట్టిపేట: రైతుల అభివృద్ధి కోసమే అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్నట్లు విద్యుత్ శాఖ సూపరింటెండెంగ్ ఇంజనీర్ జాడే ఉత్తమ్ అన్నారు. మండలంలోని జెండావెంకటాపూర్ గ్రామంలోని సబ్‌స్టేషన్‌లో మంగళవారం అదనంగా ఏర్పాటు చేసిన 5 ఎంఎ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించి మాట్లాడారు. నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈ ఎమ్మార్టీ బానోత్ రాజన్న, ఏడీఈ ఎమ్మార్టీ శరత్‌కుమార్, ఏడీఈ ప్రభాకర్, ఏఈ గణేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లల చదువుకు సహకరించండి



తల్లులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు

జన్నారం: పదో తరగతిలో మంచి ఫలితాల సాధనకు, పోషకాహారం అందించేందుకు, పిల్లల చదువుకు తల్లిదండ్రుల సహకారం అవసరమని ఇందన్‌పల్లి రేంజ్ అధికారి శ్రీధరచారి, పాఠశాల హెచ్ఎం కట్ట రాజమౌళి అన్నారు. మండలంలోని కలమడుగు గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థుల తల్లులకు విద్యార్థులు పాదపూజ చేశారు. విద్యార్థులు సమయపాలన పాటించేలా తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా నాగుల పంచమి



దండేపల్లి: పుట్టలో పాలు పోస్తున్న భక్తులు

దండేపల్లి/చెన్నూర్/రామకృష్ణాపూర్/బెల్లంపల్లి/జైపూర్/బెల్లంపల్లిరూరల్/నెన్నెల/భీమారం/లక్సెట్టిపేట/జన్నారం/వేమనపల్లి/భీమిని/మంచిర్యాలఅర్బన్/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/తాండూర్: నాగుల పంచమి వేడుకలను మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో దేవాలయాలకు వేకువ జాము నుంచే పోటెత్తారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టలో పాలుపోసి, నైవేద్యాలు సమర్పించి సల్లంగా చూడాలని నాగదేవతను వేడుకొని మొక్కులు చెల్లించుకున్నారు. బెల్లంపల్లి కెమికల్ ఏరియా హన్మాన్ ఆలయంలో 108మంది భక్తులు 108సార్లు హన్మాన్ చాలిసాను పారాయణం చేశారు. గుడి చుట్టు 108సార్లు ప్రదక్షిణలు చేసి భక్తిభావం చాటుకున్నారు.



బెలంపల్లిలో నాగదేవత విగ్రహానికి పూజలు



చెన్నూర్: శివాలయంలో భక్తుల పూజలు



జన్నారం: పుట్ట వద్ద పూజలు చేస్తున్న మహిళలు



రామకృష్ణాపూర్: మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

అడ్డగోడలుగా రాతలు!

- సింగరేణి గోడలపై ఇష్టారీతిన వ్యాపార, ప్రైవేట్ ప్రకటనలు
- చర్యలు తీసుకోవడంలో కంపెనీ నిర్లక్ష్యం
- నియంత్రించాలని కార్మికుల విన్నపం



నస్పూర్ కాలనీ సీటైప్ క్వార్టర్‌కు కంపెనీ వేసిన పెయింట్‌పై రాసిన యాడ్‌లు

శ్రీరాంపూర్: అడ్డగోలు రాతలతో సింగరేణి గోడలు అధ్వానంగా మారుతున్నాయి. కంపెనీకి చెందిన క్వార్టర్లు, కార్యాలయాల గోడలన్నీ ప్రైవేటు వ్యాపార ప్రకటనలకు అడ్డాగా మారుతున్నాయి. అడ్డుకునే వారు లేకపోవడంతో దుకాణదారులు, ప్రైవేటు కంపెనీలు తమ ఇష్టారాజ్యంగా వాల్ రైటింగ్, సైన్‌బోర్డులు, ప్రకటనలు రాస్తున్నారు. సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా మంచిర్యాల పట్టణానికి ఆనుకొని ఉండడంతో ఇక్కడ కంపెనీ గోడలన్నీ వ్యాపార ప్రకటనలతో నిండిపోతున్నాయి. కంపెనీ ప్రతీ మూడేళ్లకోసారి కార్మికులు, అధికారులు నివాసం ఉండే క్వార్టర్లకు రంగులు వేయిస్తుంది. కార్యాలయాలకు కూడా తరచూ రంగులు వేయిస్తూ ఉంటుంది. అందంగా కనిపించేందుకు వేస్తున్న ఈ రంగులను వెనువెంటనే వ్యాపారులు తమ ప్రకటనల కోసం చెరిపివేస్తున్నారు. నిత్యావసర సరుకుల దుకాణాలు, వస్త్ర వ్యాపారులు, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్, సిమెంట్ దుకాణాలు మొదలు ప్రైవేటు విద్యా సంస్థలు అందంగా ఉన్న కంపెనీ గోడలకు తమ రంగులు వేసి ప్రకటనలు రాస్తున్నారు. సదరు క్వార్టర్‌లో ఉండే కార్మికులు అడిగితే మీ సొంతిళ్లా.. కంపెనీ గోడలు.. అంటూ బెదిరిస్తూ రాస్తున్నారని పేర్కొంటున్నారు. మరికొన్ని ప్రకటనలైతే రాత్రికి రాత్రి రాసి వెళ్తున్నారని కార్మిక కుటుంబాలు పేర్కొంటున్నాయి. ఇక వాల్ పోస్టర్లయితే చెప్పనక్కర్లేదు.

కంపెనీకి నష్టం...

లక్షలాది రూపాయలు వెచ్చించి కంపెనీ రంగులు వేయిస్తుంటే వాటిపై వ్యాపారులు ప్రకటనలు రాయించడంతో కంపెనీకి తీవ్ర నష్టం జరుగుతోంది. నస్పూర్ కాలనీ జీటీ హాస్టల్‌కు ప్రతీసారి రంగులు వేస్తుంటే దానిపై తరువాత ప్రకటనలు రాయడం, వారు తుడిచివేయడం జరుగుతోంది. ఇక్కడ ఒక్క చోటనే నియంత్రించగలుగుతున్నారు. మిగితా చోట్లలో ఆ ప్రయత్నం జరగడం లేదని కార్మికులు పేర్కొంటున్నారు. నస్పూర్ కాలనీ, షిర్కే కాలనీ, నాగార్జున కాలనీ, సీసీసీ టౌన్‌షిప్, కృష్ణాకాలనీ, శ్రీరాంపూర్ కాలనీ, ఆర్కే 8 కాలనీల్లోని కంపెనీ గోడలకు ఈ ప్రకటనలు దర్శనమిస్తున్నాయి.

కఠిన చర్యలు తీసుకోవాలి..

కంపెనీ అనుమతి లేకుండా క్వార్టర్ ముందు చిన్న షెడ్డు కట్టుకున్నా వెంటనే వచ్చి కార్మికుడిపై చర్యలు తీసుకునే అధికారులు కంపెనీ గోడలను నాశనం చేస్తున్న ప్రైవేటు వ్యాపారులు, సంస్థలపై చర్యలు తీసుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. కనీసం హెచ్చరిక బోర్డులను సైతం ఏర్పాటు చేయడం లేదు. ఇప్పటికైనా ఈ వ్యాపార ప్రకటనలు నియంత్రించేలా కఠిన చర్యలు తీసుకోవాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

'దివాకర్‌రావును విమర్శించే అర్హత లేదు'



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావును విమర్శించే హక్కు, ప్రజాస్వామ్యంలో ఒక్కసారి కూడా గెలవని కాంగ్రెస్ నాయకులకు లేదని బీఆర్ఎస్ పార్టీ నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు నివాసంలో మాట్లాడారు. అధికారులను తాము బెదిరించలేదని, అభివృద్ధి పనులను కూలగొట్టడం, చట్టవిరుద్ధ పనులను చేపట్టవద్దని, అలా చేసే అధికారులు భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకుంటారని మాత్రమే చెప్పినట్లు తెలిపారు. వ్యక్తిగత విమర్శలు మానుకొని, అభివృద్ధి చేయాలన్నారు. అభివృద్ధికి తమ నాయకులు ఎవరూ అడ్డురారని తెలిపారు. ప్రతిపక్షం గొంతునొక్కేందుకు ప్రయత్నించడం సరికాదని, గతంలో చేసిన అభివృద్ధిని తొలగించడం కూడా సరికాదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ అంకం నరేశ్, తోట తిరుపతి, ఎర్రం తిరుపతి, గోగుల రవీందర్ రెడ్డి, తాజ్, నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఇన్వెస్టర్ సెర్మనీ



హెడ్‌బాయ్‌గా ఎన్నికైన విద్యార్థితో సీఐ, ఉపాధ్యాయులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక నారాయణ హైస్కూల్లో మంగళవారం ఇన్వెస్టర్ సెర్మనీ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ క్యాబినెట్ ఇన్‌స్టాలేషన్, క్లబ్ లాంచ్ చేశారు. హెడ్‌బాయ్, హెడ్‌గర్ల్స్, జూనియర్ హెడ్ బాయ్, గర్ల్స్‌లకు బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో మంచిర్యాల సీఐ ప్రమోద్‌రావు, ఏజీఎం చైతన్యరావు, ప్రిన్సిపాల్ కవిత, రీజినల్ సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ లక్పతిబానోత్, జోనల్ కో–ఆర్డినేటర్ శ్వేత, జోనల్ అనాలసిస్ట్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో విద్యార్థుల సత్తా...

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో మంచిర్యాల నారాయణ పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. ఈ నెల 26న హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో ఆరో తరగతి విద్యార్థి సంజీత్ సబ్‌జూనియర్ 40కిలోల ఫైటింగ్ విభాగంలో బంగారు పతకం, ఏడో తరగతి విద్యార్థి ప్రీథ్య క్యాడెట్ 35కిలోల విభాగంలో బంగారం పతకం సాధించారు. పతాకాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ కవిత, డీన్ రాజ్‌కుమార్, ఏజీఎం ఎనాలిస్ట్ రాజేందర్ అభినందించారు.

■ బొగ్గుబాయి వార్తలు

రెస్ట్‌హాల్స్ మరమ్మతు చేయాలి

శ్రీరాంపూర్: వర్షానికి కురుస్తున్న రెస్ట్ హాల్స్‌ను మరమ్మతు చేయించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఆ యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీసైదా ఎస్సార్పీ 3గనిలో మంగళవారం కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, జీఎం కమిటీ చర్చల ప్రతినిధులు బద్రి బుచ్చయ్య, ప్రసాద్ రెడ్డి, నాయకులు సుధాకర్, మురళి చౌదరి, దాడి రాజయ్య, నర్సింగరావు, మల్లేష్ పాల్గొన్నారు.

ఫిల్టర్‌బెడ్ పరిశీలన

రామకృష్ణాపూర్: మందమర్రి పట్టణంలోని పలు కార్మికవాడలకు తాగునీటిని సరఫరా చేసే ఫిల్టర్ బెడ్‌ను ఏఐటీయూసీ నాయకులు మంగళవారం పరిశీలించారు. కార్మిక కుటుంబాలకు స్వచ్ఛమైన నీటి సరఫరా జరుగుతుందా లేదా అనేది తెలుసుకునేందుకు అధికారులతో కలిసి ఫిల్టర్ బెడ్‌ను పరిశీలించినట్లు యూనియన్ బ్రాంచి కార్యదర్శి సలెంద్ర సత్యనారాయణ తెలిపారు. పట్టణంలో పలుచోట్ల రోడ్లకు ఏర్పడిన గుంతలకు కూడా సివిల్ సిబ్బందితో తాత్కాలిక మరమ్మతు చేపించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు భీమనాధుని సుదర్శన్, శ్రీనివాస్, తిరుపతి, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి



మొక్క నాటి నీరుపోస్తున్న జీఎం శ్రీనివాస్

జైపూర్: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని శ్రీరాంపూర్ ఏరియా జీఎం శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని ఇందారం ఓపెన్‌కాస్టు గని ఆవరణలో బలరామ జలధి వద్ద వన మహోత్సవంలో భాగంగా మంగళవారం 100మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం సత్యనారాయణ, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఏజీఎం బీభత్స, గని ప్రాజెక్టు అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి, డీజీఎం ఫారెస్ట్ హరినాథ్, అధికారులు చంద్రశేఖర్, నాగన్న, శంకర్, హన్‌మాన్, మహేశ్, జక్కారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు గురుకులాల్లో స్పాట్ కౌన్సెలింగ్

మంచిర్యాలఅర్బన్/జైపూర్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం కాళేశ్వరం జోన్‌లో జూనియర్ కళాశాల ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం గ్రూపులో మిగులు సీట్లకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు కాళేశ్వరం జోనల్ అధికారి హెచ్. అరుణకుమారి, గురుకులాల డీసీవో కోలా నాగేశ్వర్‌రావు వేర్వేరుగా తెలిపారు. ఈ నెల 31న జూనియర్ కళాశాలల్లో స్పాట్ కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు తమ దరఖాస్తులను రిజిస్ట్రేషన్ చేస్తారన్నారు. 2 గంటల తర్వాత మెరిట్ లిస్టు ప్రకటించి, వెంటనే కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. అడ్మిషన్లన్నీ ఆయా జూనియర్ కళాశాల పరిధిలో కొనసాగుతాయని, రిజర్వేషన్ ప్రకారం పదో తరగతిలో వచ్చిన మార్కుల ప్రాతిపదికన కేటాయించనున్నట్లు తెలిపారు.

బెల్లంపల్లి/తాండూర్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు బెల్లంపల్లి సంక్షేమ బాలుర గురుకుల సీవోఈ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌సాగర్, కాసిపేట సంక్షేమ బాలుర గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ ఊటూరి సంతోష్‌కుమార్, సంక్షేమ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ నిరుపమ, తాండూర్ కేజీబీవీ ప్రత్యేక అధికారి కవిత, ముల్కల్ల గురుకుల బాలుర కళాశాల ప్రిన్సిపాల్ మోహన్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు విద్యా, కుల, నివాస, ఆదాయ ఒర్జినల్ ధృవీకరణ పత్రాలతో హాజరుకావాలని సూచించారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భవన నిర్మాణానికి భూమిపూజ

తాండూర్: దర్తి ఆబజన్ జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ పథకంలో మంజూరైన హాస్టల్ భవనానికి మంగళవారం అధికారులు, నాయకులు భూమి పూజ చేశారు. దేశవ్యాప్తంగా ఈ పథకంలో మంజూరైన హాస్టల్ భవనాలకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రసాద్ వర్చువల్‌గా ప్రారంభించగా, మండలంలోని తంగళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో అధికారులు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. తంగళ్లపల్లి జెడ్పీహెచ్ఎస్‌కు అనుసంధానంగా 50మంది విద్యార్థులకు ఉపయోగపడే విధంగా రూ.2.70కోట్లతో ఈ భవన నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో మల్లేశం, డీసీసీ ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మురళీ ధర్‌రావు, మాజీ ఎంపీపీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏటీసీ సెంటర్ల ద్వారా అధునాతన సాంకేతిక విద్య

- కలెక్టర్ కుమార్‌దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రాలు అడ్వాన్స్ టెక్నాలజీ (ఏటీసీ) హబ్‌లుగా మారి అత్యాధునిక మౌలిక వసతులతో అధునాతన సాంకేతిక విద్య అందిస్తున్నట్లు కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ ప్రిన్సిపాల్ వై.రమేశ్, ఇతర అధికారులతో కలిసి అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ పోస్టర్లను ఆవిష్కరించారు. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా నైపుణ్యంతో కూడిన శిక్షణ అందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ టి.సుజాత, శిక్షణ అధికారులు, సీనియర్ సహాయకులు, ఏటీవోలు పాల్గొన్నారు.

పులుల రక్షణ అందరి బాధ్యత



భీమారం: చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

భీమారం/జన్నారం/వేమనపల్లి/లక్సెట్టిపేట/నెన్నెల: అడవులు, వన్యప్రాణులు, పులుల సంరక్షణ అందరూ బాధ్యతగా తీసుకోవాలని ఇందన్‌పల్లి రేంజ్ అధికారి శ్రీధర చారి, కుశ్నపల్లి రేంజ్ అధికారి దయాకర్, నీల్వాయి రేంజ్ అధికారి హఫీజోద్దీన్ అన్నారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం జన్నారం అటవీ డివిజన్‌లోని ఇందన్‌పల్లి, జన్నారం రేంజ్‌ల పరిధిలో, భీమారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో, లక్సెట్టిపేట గుడ్‌షెపర్డ్ పాఠశాలలో, నెన్నెల జెడ్పీ ఉన్నత పాఠశాలలో, నీల్వాయి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణలో పులుల ఆవశ్యకత, రోడ్ ఫర్ టైగర్.. సేవ్ ఫర్ టైగర్, సేవ్ ఫారెస్ట్ అనే అంశాలపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. నెన్నెలలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో జన్నారంలో సెక్షన్ అధికారులు హన్మంతరావు, రవి, సునీల్, భీమారంలో అటవీశాఖ అధికారులు సుధాకర్, రాజవ్వ, శ్రీకాంత్, శివ కుమార్, నెన్నెలలో డెప్యూటీ రేంజ్ అధికారి లక్ష్మీనారాయణ, ఎఫ్ఎస్‌వోలు రూపేశ్, రాందాస్, శ్రీలత, శ్రీనాథ్, మహేష్, వేమనపల్లిలో డెప్యూటీ రేంజ్ అధికారి ప్రమోద్ కుమార్, లక్సెట్టిపేటలో ఎఫ్ఎస్‌వో అల్తాఫ్, ఎఫ్‌బీవో సత్తయ్య, బీట్ అధికారులు పాల్గొన్నారు.

● గురుకుల విద్యార్థులకు క్రీడా పతకాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ముల్కల్ల తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు క్రీడా పతకాలు సాధించారు. లక్సెట్టిపేటలోని ఎంజేపీ క్రీడా మైదానంలో నిర్వహించిన 11వ సౌత్‌జోన్ జూనియర్, సీనియర్ విభాగాల్లో పురుష–మహిళల జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో ముల్కల్ల గురుకుల పాఠశాల, కళాశాల క్రీడాకారులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పరుగు పందెంలో జస్వంత్, అరుణ్‌కుమార్‌లు బంగారు పతకాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆగస్టు 2, 3 తేదీల్లో హన్మకొండలో జరగనున్న రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొననున్నారు. ప్రిన్సిపాల్ మోహన్, వైస్ ప్రిన్సి పాల్ మహేశ్వర్‌రావు, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ రమేశ్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి మారయ్య, పీడీలు శ్రీకాంత్, పీఈటీ సాగర్, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

● సీఐలకు సన్మానం

తాండూర్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం బదిలీపై వెళ్లిన తాండూర్ సీఐ కుమారస్వామి, బదిలీపై ఇక్కడికి వచ్చిన దేవయ్యలను అధికారులు, నాయకులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంఈఓ మల్లేశం, ఎస్సై సౌజన్య, డీసీసీ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సల్వాజి మహేందర్ రావు, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

● పేకాట స్థావరంపై దాడి

జైపూర్: మండలంలోని మిట్టపల్లి గ్రామంలో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై మంగళవారం రాత్రి ఎస్సై శ్రీధర్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది దాడి చేశారు. పేకాడుతున్న దూట సంతోశ్, జాడి వెంకటేశ్, కామెర భానేశ్, రామటెంకి మల్లేశ్, దూట రాజబాబును అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.7,300, 4 సెల్‌ఫోన్లు, బైక్స్ స్వాధీనం చేసుకున్నారు.

సంక్షిప్త వార్తలు

● సరిహద్దుల్లో పోలీసుల విస్తృత తనిఖీలు

కోటపల్లి: మావోయిస్టుల వారోత్సవాల నేపథ్యంలో తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో పోలీసులు భద్రత కట్టుదిట్టం చేశారు. మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ బన్సీలాల్, ఎస్సై రాజేందర్ ఆధ్వర్యంలో మండలంలోని రాపన్‌పల్లి సమీపంలో అంతర్రాష్ట్ర వంతెనపై విస్తృత తనిఖీలు చేపట్టారు. తెలంగాణలోకి వచ్చే ప్రతి వాహనాన్ని పూర్తిగా పరిశీలిస్తున్నారు. గ్రామాల్లోకి కొత్త వ్యక్తులు వచ్చినా, అనుమానాస్పదంగా సంచరించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ చర్యలకు ఆస్కారం లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగానే ఈ తనిఖీలు చేస్తున్నట్లు సీఐ బన్సీలాల్ తెలిపారు.

● అర్హులందరికీ సంక్షేమ పథకాలు

భీమిని/బెల్లంపల్లి: అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించడమే ప్రభుత్వ ధ్యేయం అని బెల్లంపల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నర్సింగారావు, మున్సిపల్ పదో వార్డు మాజీ కౌన్సెలర్ కొక్కెర చంద్రశేఖర్ అన్నారు. బెల్లంపల్లి పెద్దనపల్లి బస్తీలో, భీమిని, కన్నెపల్లి మండలాల్లోని అర్హులైనా లబ్ధిదారులకు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ చెక్కులు మంగళవారం అందజేశారు. ఎంపీడీవోలు గంగామోహన్, శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్లు బికర్ణదాస్, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● పరామర్శ

పాతమంచిర్యాల: జాతీయ మానవ హక్కుల కమిటీ మాజీ అధ్యక్షుడు నిమ్మరాజుల శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో జిల్లా కేంద్రంలో ఆయన కుటుంబ సభ్యులను మంగళవారం జాతీయ మానవ హక్కుల కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మొగుళ్ల భద్రయ్య పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు రూ.10వేలు సాయం అందజేశారు.

● ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పరిశీలన

దండేపల్లి: మండలంలోని మాదాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను హౌజింగ్ ఏఈ లయన్ అలీ మంగళవారం పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలను బట్టి బిల్లులు చెల్లిస్తుండంతో, నిర్మాణాలకు సంబంధించిన కొలతలు తీశారు.

● పద్మశాలీలు అన్ని రంగాల్లో రాణించాలి

కోటపల్లి: పద్మశాలీలు వ్యాపార, సామాజిక, రాజకీయ రంగాల్లో రాణించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు గాదాసు బాపు కోరారు. కొల్లూర్‌లో మంగళవారం పద్మశాలీల నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఆలకాటి శేఖర్, ప్రధాన కార్యదర్శిగా రంగు సంతోశ్, కోశాధికారిగా దానం కిరణ్, గౌరవ అధ్యక్షుడిగా రంగు రమణయ్య, ఉపాధ్యక్షులుగా రంగు రాజేశ్, దేవులపల్లి సంపత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ దేవసాని నాగరాజు తెలిపారు.